VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఆదివారం 21 జూన్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 357

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో..

## నగరంలో పలుచోట్ల భారీ వర్షం జలమయమైన లోతట్టు ప్రాంతాలు



# పీఎం కిసాన్ డబ్బులు విడుదల

### రూ. 2,000 చొప్పన 18,880 కోట్లు జమ

### హుగ్లీ జిల్లాలో విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ

**పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పన మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు.**

**కోల్‌కతా, జూన్ 20 :** 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరింది. కేంద్రప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్ధిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.



# మీనాక్షి నామినేషన్ తిరస్కరించిన ఆర్వోని క్షమించేదిలేదు

హైదరాబాద్:మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి కేసులు లేకున్నా.. రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో)ని క్షమించేది లేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. మీనాక్షి నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించిన తీరుకు నిరసనగా శనివారం గాంధీభవన్‌లో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర ఛైర్మన్ రాచమల్ల సిద్ధేశ్వర్ అధ్యక్షతన, ఆ విభాగం ఆధ్వర్యంలో సేవ్ డెమోక్రసీ నినాదంతో 'సత్యాగ్రహ దీక్ష' నిర్వహించారు. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, సంఘటన్ జాతీయ ఛైర్మన్ సునీల్ పన్వర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఛైర్మన్ మిద్దెల జితేందర్, ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, పలువురు డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. 'డెమోక్రసీ అండర్ ఎటాక్' పోస్టర్‌ను ప్రదర్శిస్తూ... కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... 'రాజ్యాంగంపై భాజపాకు నమ్మకం లేదు. దేవుని పేరు చెప్పకుండా ఎన్నికల్లో గెలిచే దమ్ము ఆ పార్టీకి ఉందా? దేశంలో పలు ప్రాంతీయ పార్టీలను చీలుస్తున్నారు. ఎంపీలను, ఎమ్మెల్యేలను కొంటున్నారు. ఎవరెన్ని చేసినా వచ్చే ఎన్నికల్లో మళ్లీ మేమే వస్తాం.

# మెట్రో రెండోదశ పొడిగింపుపై రైల్వే మంత్రిని కలుద్దాం

### 22, 23 తేదీల్లో ఢిల్లీలోనే ఉంటాను

### వెంటనే కలసి సమస్య పరిష్కారానికి కృషి చేద్దాం

### కిషన్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ పొడిగింపు అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో బహిరంగ లేఖ రాశారు. మెట్రో పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం కావాలని అన్నారు. మెట్రో ఫేజ్-2, ఎల్ అండి టి ఫైనాన్సింగ్‌పై చర్చకు సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు.**



హైదరాబాద్, జూన్ 20 : జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటానని, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీకి సమయం కేటాయించాలని సీఎం రేవంత్ కోరారు. ఇద్దరం కలిసి రైల్వే మంత్రిని కలుద్దామని ప్రతిపాదించారు. సంబంధిత ఒప్పందాల పత్రాలతో సమావేశానికి హాజరవుతానని ముఖ్య మంత్రి చెప్పుకొచ్చారు. తెలంగాణకు హైదరాబాద్ మెట్రో కీలక మౌలిక వసతి ప్రాజెక్టని ఈ సందర్భంగా లేఖలో సీఎం పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పెండింగ్ అంశాలకు త్వరితగతిన పరిష్కారం అవసరమని చెప్పుకొచ్చారు. కాగా, ఈనెల 16వ తేదీన కూడా హైదరాబాద్ మెట్రో రైలు అంశంపై కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి ఏ మీటింగ్‌కైనా తాను సిద్ధమేనని రేవంత్ అన్నారు. రైల్వే మంత్రితో వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయించాలన్నారు. ఆ సమావేశానికి సంబంధించి కిషన్ రెడ్డి పిలుపు కోసం తాను ఎదురు చూస్తానని పేర్కొన్నారు. ఇందుకు ఆయనతో వ్యక్తిగత భేటీకీ సిద్ధమేనని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు.

# హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి



### లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం

### హైడ్‌రాపై దుష్ప్రచారం తగదు

### హైడ్రా తప్పు ఉంటే క్షమాపణ అడుగుతాం

### మీడియా సమావేశంలో కమిషనర్ రంగనాథ్

**హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరు బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని, కాని దుష్ప్రచారంతో అడ్డుకోరాదని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడామని వివరించారు. శనివారం హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని తెలిపారు.**



**హైదరాబాద్, జూన్ 20 :** చట్టం అందరికీ ఒకటేనని... హైడ్రా ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించదని స్పష్టం చేశారు. హైడ్రా డిజాస్టర్ కోసం కాదని.. ఆస్తుల పరిరక్షణ కోసమేనని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తమపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో రాష్ట్ర సర్కార్ హైడ్రాకి ఫ్రీడం ఇచ్చిందని రంగనాథ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా తాము పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో ఫాతిమా కాలేజీ లాగా చాలా

-మిగతా 2 లో..



# కాంగ్రెస్ ప్రభుత్వం కరోనా కంటే ప్రమాదకరం

### మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టారు

### రైతులెవరూ కన్నీళ్లు పెట్టుకోవద్దు..

### రెండేళ్లు ఓపిక పట్టండి.. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావటం ఖాయం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం

ఆదిలాబాద్, జూన్ 20 : రాష్ట్రంలో జరిగే రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని, దానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విధానాలే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రైతులెవరూ కన్నీళ్లు పెట్టుకోవద్దని, పాలకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్నలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు పాండురంగ్ కుటుంబాన్ని కేటీఆర్ నేతృత్వంలో మాజీ మంత్రులు జోగు రామన్న, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవ లక్ష్మి, కౌశిక్‌రెడ్డిలతో

-మిగతా 2 లో..



# వీబీజీ రామ్‌జీ చట్టాన్ని సవరించాల్సిందే

### ప్రస్తుత విధానంతో పంచాయితీల బలహీనం

### కేంద్రానికి లేఖ రాశామన్న మంత్రి సీతక్క

హైదరాబాద్, జూన్ 20 : వీబీజీ రామ్‌జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి నిరసన లేఖ రాశామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. నూతన చట్టాన్ని ఉపసంహరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. నూతన చట్టంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ మూడు వేర్వేరు లేఖలు కేంద్రానికి పంపించామని వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్‌ను యథాతథంగా కొనసాగించి గ్రామీణ పేదల ఉపాధి హక్కును కేంద్రం కాపాడాలని

-మిగతా 2 లో..

# పరేడ్ గ్రౌండ్ యోగాలో పాల్గొన్న ప్రముఖులు



హైదరాబాద్, : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో పెద్ద ఎత్తున యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీగా ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు హాజరయ్యారు. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపీలు ఈటల రాజేందర్, లక్ష్మణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, సినీ నటులు నవీన్ పోలిశెట్టి, డింపుల్ హయాతి తదితరులు పాల్గొని యోగా సాధన చేశారు. ఏటా మాదిరిగానే యోగా కార్యక్రమం నిర్వహించినట్టు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. నిత్యం యోగా చేయడం వల్ల రుగ్మతల బారిన పడకుండా ఉండొచ్చని తెలిపారు.

# మూసీ నిర్వాసితులకు న్యాయం చేయండి

### బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు డిమాండ్



హైదరాబాద్, జూన్ 20 : మూసీ పునరుద్ధరణకు భాజపా వ్యతిరేకం కాదని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. బాధితులకు న్యాయం చేశాక, ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణశాఖ అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త

-మిగతా 2 లో..



# ఓట్ల ప్రక్షాళన చేపట్టడమే సర్ ప్రధాన ఉద్దేశ్యం

### ఓట్లు తొలగిస్తారన్న అపోహ సరికాదు

### చనిపోయిన, అడ్రస్ మారిన వారి ఓట్లు మాత్రమే తొలగింపు

### అ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ

# పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

### 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు

### పాడి రైతులకు బకాయిల్లేని చెల్లింపులు

### లాభసాటిగా తెలంగాణ పాడి పరిశ్రమ

### డిప్యూటీ సీం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, జూన్ 20 : రాష్ట్రంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీనం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయా డైరీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని పాడి పరిశ్రమను ఆదుకోవాలని, పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రజాప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని

-మిగతా 2 లో..





# పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటను ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎంతో పాటు పశు సంవర్ధక శాఖా మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై లోతైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పాల వినియోగం, కొత్తగా ప్రభుత్వం ప్రకటించిన మేరకు వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు పాలను అందించే అంశంపై అధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొత్తం పాల ఉత్పత్తికి సంబంధించి ఖచ్చితమైన లెక్కలు తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల అసలు సంఖ్యను గుర్తించాలని ఆదేశించారు. పాలిచ్చే పశువుల ద్వారా వస్తున్న వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి సమగ్ర నివేదికను తదుపరి సమావేశంలో ఇవ్వాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు.ల్గ÷తుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలన్నారు. రైతులకు బకాయులు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయాలని చెప్పారు. దీనివల్ల రైతులకు ఎలాంటి బకాయిలు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పాడి పరిశ్రమ మీదే ఆధారపడతారని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే.. వారి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుంది.. డైరీకి నమ్మకంతో పాలు పోస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్ధతులను అనుసరించాలని ఆయన సూచించారు. రైతులకు వ్యవసాయం పైనే కాకుండా, పాడి పరిశ్రమ ద్వారా అదనపు జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.

# హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

స్కూల్స్, కాలేజీలు ఉన్నాయని ప్రస్తావించారు. హైడ్రాకి ఎంఐఎం, కాంగ్రెస్ అందరూ ఒకటేనని తేల్చిచెప్పారు. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదన్నారు. హైడ్రా రాత్రికి రాత్రి నిర్మాణాలను కూలగొడుతుందనేది తప్పుడు ప్రచారమని తెలిపారు. గుడిసెలు వేసిన చోట మీడియాని తీసుకెళ్లి చూపించామని... అప్పుడు ఉన్నదాని కంటే వంద గుడిసెలు ఎక్కువగా పెరిగాయని.. దాని వెనకాల కొన్ని శక్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గుడిసెలు వేసిన చోట జెన్యూన్‌గా ఉన్నాయా? లేదా? పరిశీలించి... డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైడ్రా రాకపోతే... ఇప్పుడు ఉన్నవి కూడా కనపడకుండా పోయేవని రంగనాథ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన భాగ్యనగరంలో కురిసిన వర్షానికి సిటీ అతలాకుతలం అయిందని అన్నారు. లక్షమందికి మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుందని తెలిపారు. హైడ్రా తప్పు ఉంటే తప్పకుండా క్షమాపణ అడుగుతామని చెప్పారు. హైడ్రా చాలా నేర్చుకుందని, చాలా పనులు పూర్తి చేసిందని... తప్పులు జరిగితే.. సరి చేసుకుంటూ ముందుకెళ్తుందని వివరించారు. హైడ్రా సెటిల్‌మెంట్లకు అడ్డాగా కాకుండా.. రాజకీయాలకు అతీతంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ప్రజలకు నమ్మకం, విశ్వాసం కలిగేంచే విధంగా హైడ్రా పని చేస్తోందని రంగనాథ్ పేర్కొన్నారు.

# మూసీ నిర్వాసితులకు ముందు న్యాయం చేయండి

(మొదటిపేజీ తరువాయి)

ఫణికుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సింగరేణి స్కామ్ బయటపడుతుందనే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. వర్గపోరు కారణంగానే ప్రాంతీయ పార్టీలు చీలిపోతున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫాంలు ఇచ్చారు. కనీస మౌలిక సదుపాయాలు లేని బడులు లెక్కలేనన్ని ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల దుస్థితి ఎలా ఉందో రేవంత్‌రెడ్డి చూడాలి. ప్రైవేటు పాఠశాలలు ఎందుకు పెరుగుతున్నాయి? కేంద్రీయ విద్యాలయాలకు ఉన్న ఆదరణ ప్రభుత్వ బడులకు ఎందుకు లేదు? బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి. ఉస్మానియా వర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామన్నారు. కానీ.. వర్సిటీల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. టీచర్లు, ప్రొఫెసర్లు హక్కుల గురించి మాట్లాడితే సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

## ఢిల్లీలో మరోమారు ఆందోళనకు దిగిన కాక్రోచ్ పార్టీ

**న్యూఢిల్లీ, జూన్ 20 :** ఢిల్లీలో హైటెన్షన్ నెలకొంది. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)' ఆందోళనల్లో ఉద్రిక్తత నెలకొంది. నీట్ పేపర్ లీక్, కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్లతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అయితే, తమ నిరసన టైమ్ పొడగించాలని సీజేపీ డిమాండ్‌ను పోలీసులు తిరస్కరించారు. దీంతో నిరసనకారుల్ని పోలీసులు ఆ ప్రదేశం నుంచి శాంతియుతంగా తొలగించడంతో ఉద్రిక్తత మొదలైంది. సాయంత్రం 6 గంటలకు కూడా మద్దతుదారులు పెద్ద సంఖ్యలో చేరాలని సీజేపీ పిలుపునిచ్చింది. అయితే, ఢిల్లీ పోలీసులు మాత్రం గడవు ముగిసిందని, నిరసనకారులు ప్రదేశాన్ని ఖాళీ చేయాలని ఆదేశించారు. జంతర్ మంతర్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, ఎస్ఎఫ్ఐకి చెందిన పలువురు విద్యార్థి నాయకులు ఇంకా వేదికపైనే ఉన్నారు. దీనికి ముందు జనాలను ఉద్దేశిస్తూ ప్రసంగించిన దీప్కే.. శాంతియుత నిరసనకు అనుమతి పొడగించాలని ఢిల్లీ పోలీసుల్ని కోరారు. చర్చలకు మేం సిద్ధం, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలనేది మా డిమాండ్. బలవంతంగా మమ్మల్ని తొలగించడానికి పోలీసులు అరెస్టులు చేస్తే, అరెస్ట్ అయ్యే వారిలో నేనే మొదటి వ్యక్తిని అవుతానునని దీప్కే అన్నారు.

# టిటిడికి 20 లక్షల విరాళం

**హైదరాబాద్, జూన్ 20 :** తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టులకు భారీ విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపార వేత్తలు వడ్లమూడి లలిత్‌కుమార్, యలమంచిలి కృష్ణారావు శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల చొప్పున రూ.20 లక్షల విరాళం ప్రకటించారు. హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడును కలిసి ఆ విరాళం డీడీలను అందజేశారు. మహాయజ్ఞంలా నిత్యం లక్షలాది మంది భక్తులకు అన్న ప్రసాదాల వితరణకు సహకారం అందించిన దాతలను ఆయన అభినందించారు.

# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

- రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని
- ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ
- అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన

**భువనేశ్వర్,జూన్20 :** ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి



ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్బ్' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం కరోనా కంటే ప్రమాదకరం

(మొదటిపేజీ తరువాయి)


కూడిన భారాస నేతల బృందం శనివారం పరామర్శించింది. పార్టీ తరఫున బాధిత కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించి ధైర్యం చెప్పింది. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మృతిచెందిన రైతు కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నేరడిగొండలో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వం కరోనా కంటే ప్రమాదకరమైంది. మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టారు. రైతుల కోసం వెచ్చించాల్సిన నోట్ల కట్టలను సంచుల్లో నింపి దిల్లీకి పంపిస్తున్నారు. రైతులు పండించిన పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పక్షం రోజులు తిరగకముందే కేంద్రం నిర్ణయిం చిన కోటా మేరకే కొంటామని క్యాబినెట్‌లో నిర్ణయించటం దారుణం. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం రైతులకు శాపంగా మారుతోంది. కేసీఆర్ పాలనలో రాష్ట్ర మంత్రులు, భారాస ప్రజాప్రతినిధులు దిల్లీకి వెళ్లి ధర్నా చేసి పంటలు కొనుగోలు చేయించాం. ఇప్పుడేమైంది. భాజపా, కాంగ్రెస్ ఎంపీలకు బాధ్యతలేదా. పంటలు కొనుగోలు చేయకుండా రేవంత్‌రెడ్డి తప్పించుకోవాలని చూస్తే వదిలిపెట్టే ప్రసక్తేలేదు. షాపుల్లో యూరియాను అందుబాటులో ఉంచకుండా కొత్తకొత్త యాప్‌లు తీసుకొస్తే లాభమేంటి?కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు, రుణమాఫీ పథకం



కింద 70 లక్షల మంది రైతులకు రూ.లక్ష కోట్లు వెచ్చించింది. నాడు పండించిన అన్ని పంటలను కొనుగోలు చేశాం. కేసీఆర్ నేతృత్వంలో రైతుబంధు ప్రభుత్వం ఉండేది. ఇప్పుడు రాబందుల ప్రభుత్వం వచ్చింది. రెండేళ్లు ఓపిక పట్టండి. కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయండి. రైతులకు భారాస అండగా ఉంటుంది. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావటం ఖాయం" అని భరోసా ఇచ్చారు. 25 నుంచి ప్రారంభమయ్యే 'సర్' కార్యక్రమంపై పోలింగ్ బూత్‌ల వారీగా భారాస కార్యకర్తలు ప్రత్యేక దృష్టిసారించాలని కేటీఆర్ సూచించారు. బెంగాల్, బిహార్‌లో ఓట్లు గల్లంతైనట్లు మన దగ్గర దొంగ ఓట్లు ఉండకుండా, అర్హుల ఓట్లు గల్లంతు కాకుండా చూడాలన్నారు.

# ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకున్నాం

- రైతులు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది
- 48 గంటల్లో ధాన్యం కొనుగోలు మొత్తాన్ని జమచేస్తున్నాం
- ఆంధ్రాను మించి తెలంగాణ ధాన్యం పండిస్తోంది
- రైతులకు అండగా ఉంటామని ప్రకటించిన చంద్రబాబు



**పల్నాడు,జూన్20 :** రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. దాన్ని నిలబెట్టుకున్నా మని సీఎం చంద్రబాబు అన్నారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' నిధులను విడుదల చేసిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు. నిధుల విడుదలకు సంబంధించి రైతులు తమ ఫోన్ ద్వారా వచ్చాయో లేదో చూసి చెప్పాలన్నారు. అక్కడే రైతులు సెలఫోన్లు ఊపుతూ వచ్చాయని సైగలు చేశారు. టెక్నాలజీ పెరగడంతో క్షణాల్లో వ్యవహారం తెలిసిపోతోందన్నారు. కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టినందుకు తాము నమ్మకంగా పనిచేస్తున్నామని అన్నారు. వైకాపా హయాంలో అన్నదాతలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజలను కష్టాల్లోకి నెట్టడం తప్ప గొడ్డలి పార్టీకి మరేమీ తెలియదని విమర్శించారు. ఇవాళ యోగా, స్వచ్ఛాంధ్ర, అన్నదాత సుఖీభవ.. ఇలా మూడు మంచి కార్యక్రమాల్లో పాల్గొన్నాను. నా జీవితంలో ఇవాళ్టికి మించిన ఆనందం మరొకటి లేదన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం సృష్టించింది. విధ్వంసం నుంచి వికాసంవైపు తీసుకెళ్తామని మేం హామీ ఇచ్చాం. సంపద సృష్టించి.. రైతుల కష్టాలు తీరుస్తామని చెప్పాం. అన్నదాతలకు ప్రతి విషయంలో అండగా ఉన్నాం. బటన్ నొక్కగానే 99.8 శాతం మంది రైతులకు నిధులు జమయ్యాయి. గతంలో ధాన్యం కొని ఆరు నెలలైనా డబ్బులు వచ్చేవి కావు. మా ప్రభుత్వం 48 గంటల్లోనే డబ్బులు ఇస్తోందన్నారు. ఒకప్పుడు ఆంధ్ర అంటే వరి.. తెలంగాణ అంటే మెట్ట పొలాలు. ఇప్పుడు ఆంధ్రాను డామినేట్ చేసి తెలంగాణ వరిని పండిస్తోంది. మనం ప్రకృతి సేద్యం వైపు మళ్లాలి. ఎక్కువ రసాయనాలు వినియోగిస్తే.. ఇతర దేశాలు మన ఉత్పత్తులను దిగుమతి చేసుకోవు. రైతులకు లాభసాటిగా ఉండాలని పామాయిల్ పంటను ప్రోత్సహిస్తున్నాం. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మారింది. సంజీవని ప్రాజెక్టు ద్వారా అందరి ఆరోగ్యాన్ని కాపాడుతాం అని చంద్రబాబు అన్నారు. 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' కింద తొలి విడతగా 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7 వేల చొప్పున రూ.3,125 కోట్లు జమయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని మోదీ పాల్గొన్న పీఎం- కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులతో కలిసి ముఖ్యమంత్రి వంర్చువల్‌గా వీక్షించారు. లింగంగుంట్లలో ప్రజావేదిక సభ వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ప్రాసెసింగ్ వర్మీకంపోస్ట్ తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. జాతీయ నూనెగింజలు, ఆయిల్‌పామ్ మిషన్ ప్రదర్శనలను తిలకించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చన్నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్‌జీ చట్టాన్ని సవరించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల అధికారాలను బలహీనపరిచే నిబంధనలని వెంటనే సవరించాలని విజ్ఞప్తి చేశారు. వీబీజీ రామ్‌జీ నిధుల కేటాయింపు విధానం పేదలు, దళితులు, గిరిజనులకు అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులకు ఉపయోగపడే జీవనోపాధి పనులను కొనసాగించాలని మంత్రి సీతక్క సూచించారు. వరదలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ, న్యూట్రి గార్డెన్లు, వెదురు తోటలకు అనుమతి ఇవ్వాలని కోరారు. 60 రోజుల తప్పనిసరి ఉపాధి విరామం గ్రామీణ పేదల ఆదాయాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాలు, నీటి ఎద్దడి ప్రాంతాలకు 60 రోజుల నిషేధం నుంచి మినహాయింపు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ పనులకు ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మొక్కల పెంపకం, అటవీకరణ కార్యక్రమాలకు ఉపాధి విరామం వర్తింపజేయొద్దని అన్నారు. దళితులు, గిరిజనులు, భూమిలేని కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చట్టంలో మార్పులు చేయాలని మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా చూడకుండా గ్రామస్థాయి ఉపాధి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. ఆదిలాబాద్, ములుగు, కుమురంభీం, ఆసిఫాబాద్ వంటి వెనుకబడ్డ ప్రాంతాల అవసరాలు విస్మరించొద్దని అన్నారు. గ్రామ పంచాయతీల్లో నమోదైన వాస్తవ పనిదినాల ఆధారంగానే నిధుల కేటాయింపు జరగాలని సూచించారు. నిధుల పంపిణీ విషయంలో కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పుకొచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వీబీజీ రామ్‌జీ పరిధిలో అనుమతించాలని కోరారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు గతంలోలాగే 90 రోజుల ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత భూ అభివృద్ధి పనులను తొలగిస్తే చిన్న రైతులకు నష్టమని చెప్పారు.

# నగరంలో పలుచోట్ల భారీ వర్షం

## జలమయమైన లోతట్టు ప్రాంతాలు

**హైదరాబాద్, జూన్ 20 :** భాగ్యనగరంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడుతుండటంతో పలు ప్రాంతాలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగిపోగా, ప్రధాన రహదారులపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాదాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ పంజాగుట్ట, బేగంపేట్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, టోలిచౌకి వంటి పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. జీహెచ్ఎంసీ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షం కారణంగా భాగ్యనగరంలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ఐటీ కారిడార్ పరిధిలోని మాదాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ రోడ్లతో పాటు పంజాగుట్ట, అసెంబ్లీ పరిసర ప్రాంతాలు, సికింద్రాబాద్ పరిధిలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనదారులు వర్షంలో తడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకు పోయారు. పరిస్థితిని సమీక్షించిన నగర పాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. త్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించడానికి మెట్రో రైలు సేవలను వినియోగించుకోవాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ మాన్‌సూన్ ఎమ్జ్గ÷న్సీ టీమ్స్ రోడ్లపై నిలిచిన నీటిని తొలగించేందుకు నిరంతరం శ్రమిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# నింబాల్కర్ హత్య కేసులో కీలక పరిణామం

## 20 ఏళ్ల తరవాత పద్మసింహ పాటిల్ తదితరులు నిర్దోషులగా ప్రకటన

**ముంబై, జూన్ 20 :** రెండు దశాబ్దాలుగా మహారాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా ఉన్న పావన్‌రాజే నింబాల్కర్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముంబైలోని ప్రత్యేక సీబీఐ కోర్టు ఈ కేసులో మహారాష్ట్ర మాజీ హోంమంత్రి, పద్మసింహ్ పాటిల్‌తో పాటు మొత్తం తొమ్మిది మందిని నిర్దోషులుగా ప్రకటించింది. దాదాపు 20 సంవత్సరాల పాటు సాగిన ఈ కేసులో 128 మంది సాక్షులను విచారించిన అనంతరం కోర్టు ఈ తీర్పు వెలువరించింది. 2006 జూన్ 3న కాంగ్రెస్ నేత పావన్‌రాజే నింబాల్కర్ తన డ్రైవర్ సమద్ అబ్దుల్ వాహిద్ కాజీతో కలిసి ప్రయాణిస్తుండగా నవీ ముంబైలోని కలంబోలి ప్రాంతంలో దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నింబాల్కర్, ఆయన డ్రైవర్ మరణించారు. ఈ హత్యలకు రాజకీయ శత్రుత్వమే కారణమని దర్యాప్తు సంస్థలు అప్పట్లో వెల్లడించాయి. నింబాల్కర్‌ను రాజకీయంగా తొలగించేందుకు పద్మసింహ్ పాటిల్ కుట్ర పన్నారని, దానికి పలువురు సహకరించారని సీబీఐ పేర్కొంది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఈ కేసులో తీర్పు వచ్చింది.. నిందితులపై అభియోగాలు నిరూపించేందుకు తగిన ఆధారాలు లేవని ప్రత్యేక సీబీఐ కోర్టు పేర్కొంది. దీంతో పద్మసింహ్ పాటిల్ సహా మిగతా నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. కోర్టు తీర్పుపై సీబీఐ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ తీర్పును బాంబే హైకోర్టులో సవాలు చేయనున్నట్లు సమాచారం.

వేగుచుక్క

# పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా తెలంగాణ

**ఆరోగ్యమే అభివృద్ధికి అసలైన సూచిక**
**పేదలకు అండగా నిలవడమే నిజమైన వైద్యం**
**వైద్యం సామాన్యుడికి అందుబాటులో ఉండాలి**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్, జూన్ 20 :** ప్రజల ఆరోగ్యమే అత్యున్నతమైన అభివృద్ధికి అసలైన నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇండియా హెల్త్ సమిట్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైద్య రంగ నిపుణులు, ప్రముఖ వైద్యులు, హాస్పిటల్స్, ఫార్మా, బయోటెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగానికి చెందిన ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆరోగ్యం అనేది కేవలం ఒక ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదన్నారు. ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా కుప్పకూలిపోతుందని, వారి జీవితాంతం దాచుకున్న పొదుపు మొత్తం ఒక్క క్షణంలో కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు ఎటువంటి భయం లేకుండా ఆసుపత్రిలో అడుగుపెట్టేలా తక్కువ ధరకు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. దేశం ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలోనే తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎయిమ్స్ వంటి ఉన్నతమైన వైద్య విద్యాసంస్థలను స్థాపించి దేశానికి ఒక దిశను చూపించారన్నారు. పేద దేశంలో వైద్యం అనేది విలాసంగా మారకూడదనే ఉద్దేశంతో ఆనాడు పునాది వేశారన్నారు. అదేవిధంగా 1975లో ఇందిరా గాంధీ తీసుకొచ్చిన సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకాన్ని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ హయాంలో తీసుకొచ్చిన యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ పక్రియను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లారన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి నాయకత్వంలో వచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, ఆశా వర్కర్ల వ్యవస్థ గ్రామీణ ఆరోగ్య ముఖచిత్రాన్ని మార్చివేసిందని గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ప్రవేశపెట్టిన 'ఆరోగ్యశ్రీ' పథకం పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇచ్చిందన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చావుకు దగ్గర కాకూడదని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని అన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందిస్తూ, గుండె, కిడ్నీ వంటి ఖరీదైన జబ్బులకు సైతం పేదవాడు ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా ఈ పథకం అండగా నిలిచిందన్నారు. వైద్య రంగంలో వస్తున్న టెక్నాలజీ, టెలిమెడిసిన్, సరికొత్త పరికరాలు కేవలం కార్పొరేట్ వర్గాలకే పరిమితం కాకుండా అట్టడుగు వర్గాలకు సైతం అందాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నాయకత్వం అనేది ఒక సర్టిఫికేట్ కాదు, అదొక బాధ్యత అని వ్యాఖ్యానిస్తూ, సైన్స్ అనేది సామాన్యుడికి, టెక్నాలజీ అనేది పేదవాడికి సేవ చేయాలన్నారు. ప్రస్తుత వైద్య విధానం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే 'ఇల్‌నెస్ కేర్' గా మాత్రమే ఉండిపోకూడదన్నారు. వ్యాధి రాకుండా ముందే నివారించే 'వెల్‌నెస్ కేర్' గా మారాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఐసీయూల కంటే వ్యాధి నివారణే అత్యంత చౌకైన మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ నేడు దేశంలోనే పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా అవతరించిందని భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రుల బలోపేతం, వైద్య విద్యాసంస్థల విస్తరణ, నర్సింగ్ మరియు పారామెడికల్ రంగాలను ప్రోత్సహించడం ద్వారా వైద్య రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నామని అన్నారు. వైద్య రంగంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం అనేది కేవలం వ్యాపార లాభాల కోసం కాకుండా, ప్రభుత్వ ఆశయాలకు ప్రైవేట్ రంగానికి ఉన్న నైపుణ్యాలను జోడించి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికే ఉపయోగపడాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో వైద్య రంగానికి అవసరమైన మానవ వనరులను, నైపుణ్యాలను అందించడానికి తెలంగాణ పూర్తిగా సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌లో ఉన్న బలమైన ఫార్మాస్యూటికల్ బేస్, మెడికల్ డివైజెస్ పార్క్, ఐటీ టాలెంట్ మరియు ప్రభుత్వ అండదండల వల్ల తెలంగాణ ప్రపంచంలోనే మెడికల్ ఎక్సలెన్స్ ఇకోసిస్టమ్‌కు కేంద్రంగా మారిందన్నారు. ఇక్కడి నుంచే భారతదేశానికి, ప్రపంచానికి ఉపయోగపడే సరికొత్త హెల్త్ కేర్ ప్రొటోకాల్స్, డయాగ్నోస్టిక్స్ మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లు రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు.

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

అమరావతి: దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాందేవ్ బాబా శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగా పక్రియలను రాందేవ్ బాబా సీఎంకు వివరించారు. బాబారామ్‌దేవ్‌తో కలిసి సీఎం యోగా సాధన చేశారు. రామ్‌దేవ్ శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. యోగాకు.. రాందేవ్ బాబా మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. యోగా సాధనతో ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. ఆయన శిక్షణలో యువత యోగాసనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందన్న సీఎం.. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని వివరించారు. బాబారామ్‌దేవ్ ఏదైనా చేయగలరన్నారు. యోగాకు.. రామ్‌దేవ్ మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. యోగా మన సంప్రదాయం, విజ్ఞానం, వారసత్వ సంపద అని చెప్పుకొచ్చారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని సీఎం అన్నారు. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని తెలిపారు. దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఏపీ మారనుందని పేర్కొన్నారు. ఉండవల్లి కొండల వద్ద యోగా.. చాలా అందమైన ఆలోచన అని అన్నారు. అమరావతి కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ నేషన్స్‌ను ఒప్పించి ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 31శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రాందేవ్‌బాబా మాట్లాడుతూ.. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం.. చంద్రబాబు అని కితాబిచ్చారు. ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సీఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహారాష్ట్ర యశ్వాడిలో ఘోర ప్రమాదం

**హనుమాన్ ఆలయం పైకప్పు కూలి నలుగురు మృతి**

**ముంబై,జూన్ 20 :** మహారాష్ట్రలోని పర్భానీ జిల్లా యశ్వాడి గ్రామంలో శనివారం ఘోర ప్రమాదం సంభవించింది. ఇక్కడి ప్రసిద్ధ హనుమాన్ ఆలయంలో నిర్మాణంలో ఉన్న మండపం పైకప్పు భాగం ఒక్కసారిగా కూలింది. ఈ ప్రమాదంలో నలుగురు భక్తులు చనిపోగా, 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మరికొందరు శిథిలాల కింద చిక్కుకున్నారు. నుమాన్ దేవాలయాల్లో శనివారం భక్తుల రద్దీ సాధారణంగానే ఎక్కువగా ఉంటుంది. యశ్వాడి గ్రామంలోని ఈ ఆలయానికి కూడా ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులంతా దర్శనం కోసం వేచి ఉన్న సమయంలో, గత కొన్ని రోజులుగా నిర్మాణంలో ఉన్న మండపం పైకప్పు, దానికి ఆసరాగా ఉన్న ఒక పిల్లర్, గోవా కర్రలు ఒక్కసారిగా కుప్పకూలి కింద ఉన్న భక్తులపై పడ్డాయి. ఈ హఠాత్పరిణామంతో ఆలయ ప్రాంగణంలో ఒక్కసారిగా తీవ్ర కలకలం, భయాం దోళనలు రేగాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం. మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో దాదాపు 20 మంది భక్తులకు తీవ్ర గాయాలయినట్టు సమాచారం. వెంటనే స్పందించిన స్థానికులు, ఆలయ సిబ్బంది గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గత కొన్ని రోజులుగా ఈ సభామండపం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణంలో ఉన్న మండపం కూలిపోవడానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు.



## బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

**వారం పాటు బెయిల్ మంజూరు చేసిన కోర్టు**

**హైదరాబాద్,జూన్ 20 :** కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు న్యాయస్థానంలో ఉపశమనం లభించింది. ఓ యువతిపై లైంగిక దాడి కేసులో అరెస్టై చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌కు మల్కాజ్‌గిరి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా భగీరథ్ జైలు జీవితం అనుభవిస్తున్నాడు. తాజాగా ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో న్యాయవాదులు మధ్యంతర బెయిల్ కోరారు. వాదనల విన్న కోర్టు నెల 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇదిలా ఉండగా.. గత నెలలో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అతడిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్న భగీరథ్ మే 17న ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయాడు. ఇక, నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు గతంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. మేడ్చల్ మేజిస్ట్రేట్ అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు. అంతకుముందు రెండు గంటలకుపైగా సిట్ అధికారులు అతడిని విచారిం చారు. అప్పటి నుంచి నెల రోజులకు పైగా జైలు జీవితం గడిపిన భగీరథ్ తాజాగా బెయిల్‌పై బయటకు రానున్నాడు.

# ఓట్ల ప్రక్షాళన చేపట్టడమే సర్ ప్రధాన ఉద్దేశ్యం

- **ఓట్లు తొలగిస్తారన్న అపోహ సరికాదు**
- **చనిపోయిన, అడ్రస్ మారిన వారి ఓట్లు మాత్రమే తొలగింపు**
- **ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ**

**హైదరాబాద్, జూన్ 20 :** తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి సర్ పక్రియ ప్రారంభం అవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 15 నుంచి జూన్24 వరకు సన్నాహక పక్రియ జరుగుతుందని.. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫాం అందజేసే పక్రియ కొనసాగుతుందని చెప్పారు. మిస్ అయిన వారికి ఫాం 6తో మరోమారు ఎన్యూమరేట్ ఫాం అందజేసే అవకాశం ఉందన్నారు. జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు సీఈవో వెల్లడించారు. ఓటరు జాబితాలో ప్రస్తుతం ఎక్కడ ఓటు ఉందో అదే అడ్రస్‌కు ఎన్యూమరేషన్ ఫాం వస్తుందని సీఈవో తెలిపారు. ఆ అడ్రస్‌లో ఓటరు లేకపోతే అతని ఓటు అక్కడ తొలగించబడుతుందన్నారు. ప్రస్తుతం ఉంటున్న అడ్రస్‌తో మళ్లీ ఓటరు ఫాం8తో ఓటును ఎన్‌రోల్‌మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సర్ ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమని.. ఓటర్లను తొలగించడం కాదని స్పష్టం చేశారు. 24 ఏళ్లుగా ఇక్కడ ఓటర్ జాబితా ప్రక్షాళన జరగలేదన్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది మృతి చెంది ఉంటారని.. కొందరు వలస వెళ్లి ఉంటారని తెలిపారు. వాటన్నింటినీ సరి చేయడమే సర్ ఉద్దేశమని చెప్పారు. ఇందులో రాజకీయ ప్రేరేపితం ఏమీ ఉందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఎన్యూమరేషన్ ఫాం ఇస్తారని తెలిపారు. కులం, మతంతో సంబంధం లేకుండా అందరికీ ఫాం ఇస్తారన్నారు. ఎన్యూమరేషన్‌లో ముస్లిం, హిందూ అనే వ్యత్యాసం ఉండదని చెప్పారు. ఒక వర్గం ఓట్లు తొలగిస్తారనే ఆందోళన అవసరం లేదని సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.

# పుట్టినరోజు అంటే కేక్ కాదు.. మొక్కలు!

- 6 ఏళ్ల చిన్నారి చైత్ర గ్రీన్ మిషన్‌కు అందరూ ఫిదా.



**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్ :**

నేటి కాలంలో పుట్టినరోజులు అంటే కేక్ కటింగ్, వేడుకలు, పార్టీలు సాధారణం. అయితే ఓ చిన్నారి మాత్రం తన పుట్టినరోజును ప్రకృతికి అంకితం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణపై గొప్ప సంకల్పంతో ముందుకు సాగుతున్న చిన్నారి చైత్ర, ప్రతి పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటుతూ "చైత్ర వనం" పేరుతో స్ఫూర్తిదాయక కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. చైత్ర తన 5వ పుట్టినరోజు సందర్భంగా 50 మొక్కలు, 6వ పుట్టినరోజు సందర్భంగా మరో 60 మొక్కలు నాటింది. ప్రతి ఏడాది ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ 50వ పుట్టినరోజు నాటికి 12,650 మొక్కలు, 75వ పుట్టినరోజు నాటికి 28,200 మొక్కలు, 100వ పుట్టినరోజు నాటికి 50400 మొక్కలు నాటాలనే గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ సందర్భంగా చిన్నారి చైత్ర మాట్లాడుతూ.. "నా చిన్న ప్రయత్నం అందరికీ స్ఫూర్తిగా మారాలి. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు సందర్భంగా కనీసం ఒక మొక్కైనా నాటి ప్రకృతికి కానుక ఇవ్వాలి. మనం నాటే ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు జీవనాధారం అవుతుంది" అని పిలుపునిచ్చింది. చైత్ర తల్లిదండ్రులు అయిన బాస సుశీల్ కుమార్ ఆర్మూర్ డివిజన్ అటవి బీట్ అధికారి మరియు బాస అన్నపూర్ణ, ఎస్బిఐ అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడుతూ.. తమ కుమార్తె పేరుతో ప్రారంభమైన 'చైత్ర వనం' భవిష్యత్‌లో మహోన్నత వనంగా మారి ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణకు తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి బి. సుశీల్ కుమార్ వారి బంధుమిత్రులతో పాటు ఆర్మూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంజయ్ గేడ్, అటవీ శాఖ సిబ్బంది, చిన్నాపూర్ గ్రామ సర్పంచ్ పుప్పాల చిన్న, గ్రామస్థులు పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. "ప్రతి ఇంట్లో పుట్టినరోజు సందర్భంగా కనీసం ఒక మొక్క నాటే సంప్రదాయం ప్రారంభమైతే, రానున్న తరాలకు పచ్చని ప్రకృతిని అందించగలం" అని అభిప్రాయపడ్డారు. "ఒక మొక్క... ఒక ప్రాణం... ఒక భవిష్యత్." చిన్నారి చైత్ర సంకల్పం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలవాలని స్థానికులు ఆకాంక్షించారు.

## శాంతి ఒప్పందం వేళ మళ్లీ పీటముడి

**హర్మూజ్ మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన**

**టెహ్రాన్, జూన్ 20 :** అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హర్మూజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇది తమ ప్రతిస్పందనలో మొదటి అడుగు అని, దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఈ మే-రకు ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్-అల్ అన్బియా ప్రకటించినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది. నౌకలు జలసంధి వైపు రావద్దని.. అలా వస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ స్పష్టం చేసింది. ఏదైనా ఒప్పందం అమలు దశలోకి వచ్చినప్పుడు మాత్రమే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొంది. ఇదే సమయంలో, మధ్యంతర ఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు స్విట్జర్లాండ్‌కు తమ బృందం వెళ్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా త్వరలోనే స్విస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. సాంకేతిక అంశాలపై రెండు దేశాలు చర్చలు జరిపేందుకు శుక్రవారమే అక్కడకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. అది వాయిదా పడిన విషయం తెలిసిందే.

## గత ప్రభుత్వాల సంకెళ్ల నుంచి బెంగాల్‌కు విముక్తి

**బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మోడీ వ్యాఖ్య**

**కోల్‌కతా,జూన్20 :** గత ప్రభుత్వాల హయాంలో బందీగా ఉన్న బెంగాల్ సంకెళ్ల నుంచి విముక్తి పొందిందని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో రక్తపాతాన్ని, ప్రాణనష్టాన్ని చవిచూసినప్పటికీ బెంగాల్ తన అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కోల్పోలేదని ప్రధాని పేర్కొన్నారు. దేశ విభజన సమయంలో రాష్ట్రాన్ని భారత్ నుంచి విడదీయడానికి కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించినందుకు ప్రజలు కాంగ్రెస్‌కు, టీఎంసీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఒకే ఒక్క ఎన్నికల తీర్పు తెచ్చిన మార్పు రాష్ట్రవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి కంచె ఏర్పాటుకు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించలేదని ప్రధాని దుయ్యబట్టారు.

## మైనారిటీల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **బోయపల్లిలో టీఎంఆర్ఈఐఎస్ పాఠశాల ప్రారంభం**
- **కార్యక్రమంలో మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్**

**మహబూబ్‌నగర్,జూన్20 :** తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బోయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాల భవనాన్ని మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక విద్యా సంస్థలను అభివృద్ధి చేస్తోందన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, స్కాలర్‌షిప్‌లు, కోచింగ్ సౌకర్యాలు, పాఠ్యపుస్తకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తును బలోపేతం చేస్తున్నామని తెలిపారు. విద్యే అభివృద్ధికి మూలాధారం. ఎంత ఎక్కువగా చదువుకుంటే అంత ఎక్కువ అవకాశాలు లభిస్తాయి. విద్యార్థులు కష్టపడి చదివి తమ ప్రతిభను నిరూపించుకోవాలి. ప్రభుత్వం మీకు అవసరమైన ప్రతి సహకారం అందించడానికి సిద్ధంగా ఉంది' అని మంత్రి పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి దానిని మెరుగుపరుచుకోవాలని, క్రమశిక్షణ, అంకితభావం, కఠోర శ్రమ ద్వారానే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ఆయన సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి విజన్‌కు అనుగుణంగా తెలంగాణను విద్యా రంగంలో దేశానికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. సందర్భంగా హాజరైన ప్రజాప్రతినిధులు మరియు అధికారులు మైనారిటీ విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. బోయపల్లి టీఎంఆర్ఈఐఎస్ పాఠశాల భవనం విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిమ్రిస్ చైర్మన్ శ్రీ ఫహీమ్ ఖురేషి, తెలంగాణ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ఉబైదుల్లా కొత్వాల్, మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీ బి. షఫీయుల్లా, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డి.కె. అరుణ, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు, మైనారిటీల సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కమ్యూనిటీ నాయకులు, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నరహరి లాకర్లలో భారీగా డబ్బులు

**కోటిన్నర నగదు స్వాధీనం.. రెండున్నర కిలోల బంగారు ఆభరణాలు**

**హైదరాబాద్,జూన్20 :** ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి లాకర్లలో భారీగా నగదు, బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. దాదాపు కోటిన్నర నగదుతో పాటు, రెండున్నర కిలోల బంగారు అభరణాలను లాకర్లలో అధికారులు గుర్తించారు. నరహరిపై అవినీతి, అక్రమాస్తుల ఆరోపణలు నేపథ్యంలో ఆయనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ దర్యాప్తును ఏసీబీ అధికారులు ముమ్మరం చేశారు. ఈక్రమంలో నరహరికి సంబంధించిన బ్యాంకు లాకర్లను బద్దలు కొట్టి కీలక ఆధారాలను సేకరించారు. నరహరి కుటుంబ సభ్యులు లాకర్ తాళాలను అందించేందుకు నిరాకరించడంతో న్యాయస్థానం అనుమతి తీసుకుని ఏసీబీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కోర్టు జారీ చేసిన సెర్చ్ వారెంట్ ఆధారంగా బ్యాంకు అధికారుల సమక్షంలో లాకర్లను బద్దలు కొట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ పక్రియ మొత్తం నిబంధనల ప్రకారం జరిగింది. ఈ సోదాల సమయంలో లాకర్లలో భారీ మొత్తంలో నగదు, బంగారం ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. లాకర్‌లో రూ.1.50 కోట్ల నగదుతో పాటు సుమారు రెండున్నర కిలోల బంగారం లభించింది. స్వాధీనం చేసుకున్న బంగారం విలువను అధికారులు అంచనా వేస్తున్నారు. లాకర్లలో దొరికిన నగదు, బంగారానికి సంబంధించిన పత్రాలను కూడా ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. అవసరమైతే ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు రికార్డులు, పన్ను వివరాలను కూడా పరిశీలించే అవకాశం ఉంది. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. భారీ మొత్తంలో నగదు, బంగారం బయటపడటంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఏసీబీ అధికారులు సేకరించిన ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

## బస్సులో బంగారు ఆభరణాల చోరీ

**నంద్యాల,జూన్20:** ఓ దాబా వద్ద ప్రైవేటు బస్సులో చోరీ జరిగింది. హైదరాబాద్ వైపు వెళుతున్న ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తుండగా తన వద్ద నుంచి సుమారు 2.750 కిలోల బంగారం మాయమైందని బాధితుడు మోతీలాల్ తెలిపారు. బస్సు జడ్చర్ల దాటిన తర్వాత బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితుడు.. శనివారం మధ్యాహ్నం డోన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో దాబా వద్ద బస్సు ఆగినప్పుడు చోరీ జరిగిందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలోనూ ఈ దాబా వద్ద రెండు సార్లు వెండి చోరీ ఘటనలు జరగడం గమనార్హం.

# ప్రభాస్ 'స్పిరిట్'లో మాస్ ఎంట్రీకి భారీ ప్లాన్!

హైదరాబాద్, జూన్ 19


టాలీవుడ్ స్టార్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'స్పిరిట్' గురించి ఆసక్తికరమైన వార్తలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ చిత్రంలో ప్రభాస్‌ను ఇప్పటివరకు చూడని విధంగా పవర్‌ఫుల్ పోలీసు అధికారిగా చూపించను న్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అభిమానులకు థియేటర్లలో పూనకాలు తెప్పించేలా ప్రభాస్ పాత్రకు భారీ స్థాయిలో ఎంట్రీ సీన్‌ను దర్శకు డు రూపొందిస్తున్నట్లు సమాచారం. సాధార ణంగా సందీప్ రెడ్డి వంగా చిత్రాలు కథ, పాత్రల భావోద్వేగాల చుట్టూ తిరుగుతూ, కమర్షియల్ హంగులకు కొంత దూరంగా ఉ ంటాయి. అయితే ఈసారి ప్రభాస్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రేక్షకులకు కావాల్సిన మా స్ అంశాలను కూడా పుష్కలంగా జోడిస్తు న్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా ప్రభాస్‌కు ప్రత్యేకంగా ఒక భారీ ఇంట్రడక్షన్ సాంగ్‌ను కూడా రూపొందించే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్లు సమాచా రం. ఈ ఎంట్రీ సీక్వెన్స్ ప్రభాస్ సినీ కెరీర్‌లోనే అత్యంత గుర్తుండిపోయే సన్నివేశాల్లో ఒకటిగా నిలుస్తుందని ప్రచారం జరుగుతోంది.




# 'డాన్ 3' వివాదంపై రణ్‌వీర్ మౌనం

ముంబై, జూన్ 19

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ 'డాన్ 3' చిత్రానికి సంబంధించిన వివాదంపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ అంశంపై కనీసం 18 నెలల పాటు ఎలాంటి వ్యాఖ్యలు చేయకూ డదని, అలాగే మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వకుండా ఉండాలని ఆయన నిర్ణయించు కున్నట్లు సమాచారం. తన తదుపరి చిత్రం 'ప్రళయ్' విడుదలయ్యే వరకు ఈ మౌనం కొనసాగుతుందని బాలీవుడ్ వర్గాలు చెబుతు న్నాయి. ఇటీవల ఓ ప్రముఖ సినీ మాధ్యమ ప్రతినిధులు రణ్‌వీర్‌ను కలిసిన సందర్భంగా, 'డాన్ 3' అంశంపై తాను స్పందించనని, కొంత కాలం ఇంటర్వ్యూలకు కూడా దూరంగా ఉంటానని స్పష్టం చేసినట్లు సమాచారం. 'డాన్ 3' చిత్రం విషయంలో రణ్‌వీర్ సింగ్, దర్శకుడు ఫర్హాన్ అక్తర్ మధ్య సృజనాత్మక విభేదాలు తలెత్తినట్లు గత కొంతకాలంగా ప్రచారం సాగుతోంది. కథ, చిత్రీకరణ ప్రణాళి కలు, వరుస వాయిదాలు వంటి అంశాలపై అసంతృప్తితో రణ్‌వీర్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ వ్యవ హారం తరువాత మరింత ముదిరి చట్టపరమైన వివాదంగా మారినట్లు సినీ వర్గాలు పేర్కొం టున్నాయి. నిర్మాణ సంస్థ నుంచి భారీ నష్టపరి హారం డిమాండ్ చేయడం, సినీ కార్మిక సంఘం నుంచి సహకార నిరాకరణ ప్రకటన వెలువడటం వంటి పరిణామాలు చోటుచేసు కున్నాయి. అయితే అనంతరం ఆ ఆదేశాలను ఉపసంహరించుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'ప్రళయ్' చిత్రంపై దృష్టి సారించాడు. వినాశనానంతర నేపథ్యంలో సాగే ఈ కథలో భయానక, ఉత్కంఠభరిత అంశాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న ముం బై నగరాన్ని నేపథ్యంగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో పలు విజ యవంతమైన ధారావాహికలు, కథా ప్రాజెక్టు లకు సహాయ దర్శకుడిగా పనిచేసిన ఆయనకు ఇది తొలి భారీ చిత్రంగా నిలవనుంది. ప్రము ఖ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.





# 'ఎన్‌బీకే 111'లో కాజల్.. ఫస్ట్‌లుక్ విడుదల

హైదరాబాద్, జూన్ 19

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఎన్‌బీకే 111' నుంచి చిత్రబృందం అభిమానులకు ప్రత్యేక కానుక అందించింది. నటి కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ, ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గత కొన్ని వారాలుగా ఈ చిత్రంలో కథానాయిక ఎవరు అన్న అంశంపై పలు ఊహాగానాలు వినిపించగా, తాజా ప్రకటనతో వాటికి తెరపడింది. విడుదలైన పోస్టర్‌లో కాజల్ సాధారణ చీరకట్టులో, కళ్లజోడు ధరించి గంభీరంగా కనిపించింది. కార్యాలయ వాతావరణంలో నిలబడి ఉన్న ఆమె రూపం పాత్ర ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. సాధారణంగా గ్లామర్ పాత్రల్లో కనిపించే కాజల్‌ను ఈ చిత్రంలో భిన్నమైన శైలిలో చూపించడం విశేషంగా మారింది. పోస్టర్‌ను విడుదల చేసిన చిత్రబృందం ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ చిత్రం ఆమె సినీ ప్రయాణంలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. ఇది బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం. గతంలో విడుదలైన 'భగవంత్ కేసరి'లో వీరిద్దరూ కలిసి నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఆ చిత్రంలో కాజల్ పాత్రకు మంచి గుర్తింపు లభించగా, తాజా చిత్రంలో ఆమె మరింత కీలకమైన పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ వ్యయంతో రూపొం దుతున్న ఈ చిత్రంలో యాక్షన్, భావోద్వేగ అంశాలకు సమాన ప్రాధాన్యం ఉంటుందని సమాచారం. కథలో కీలక మలుపులు తిప్పే పాత్రలో కాజల్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతుండగా, త్వరలోనే మరిన్ని విశేషాలను చిత్రబృందం వెల్లడించే అవకాశం ఉంది. బాలకృష్ణ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు కూడా ఈ చిత్రంపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. గోపీచంద్ మలినేని మాస్ టేకింగ్, బాలకృష్ణ శక్తివంతమైన పాత్ర, కాజల్ కీలక పాత్ర ఈ చిత్రా నికి ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి.

# మరాఠీ సినిమాకు అండగా నిలిచిన షారుఖ్

ముంబై, జూన్ 19

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ మరో సారి తన గొప్ప మనసును చాటుకు న్నారు. తెరపై మాత్రమే కాదు, నిజ జీవితంలోనూ సహాయసహకారాలతో ఎందరో అభిమానుల హృదయాలను గెలు చుకుంటున్న ఆయన, ఒక మరాఠీ చిత్రా నికి అండగా నిలిచి దాని విజయానికి పరోక్షంగా కారణమయ్యారని ఆ చిత్ర దర్శకుడు వెల్లడించారు. ఇటీవల విడుదలై మరాఠీ సినీ పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'దేవూల్ బంద్ 2' చిత్ర విజయగాథ వెనుక షారుఖ్ ఖాన్ సహ కారం ఉందని దర్శకుడు ప్రవీణ్ తార్డే తెలిపారు. సినిమా విడుదలకు ముందు థియేటర్లలో ప్రదర్శన కోసం అవసరమైన డిజిటల్ ప్రదర్శన ప్యాకేజీ ఖర్చు సుమారు రూ.42 లక్షలు అయ్యిందని చెప్పారు. చిన్న బడ్జెట్ చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమాకు అంత మొత్తాన్ని సమకూర్చడం కష్టంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో చిత్రబృందం షారుఖ్ ఖాన్‌కు చెందిన సంస్థను సంప్రదించిందని తెలిపారు. విషయం తెలుసుకున్న షారుఖ్ ఖాన్ వెంటనే స్పందించి, సినిమా విడుదలకు అడ్డంకిగా మారిన ఆ బిల్లును మాఫీ చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు.



# సన్నబడటంపై స్పందించిన సమంత.. అసలు కారణం ఇదే!

హైదరాబాద్, జూన్ 19

ప్రముఖ కథానాయిక సమంత తన శారీరక ఆకృతిపై సోషల్ మీడియాలో వస్తున్న వ్యాఖ్యలకు ఘాటుగా స్పందిం చారు. తాను కావాలని బరువు తగ్గలేదని, తీవ్రమైన అనారోగ్య సమస్య కారణంగానే సన్నబడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ప్రజలు పూర్తి విషయాలు తెలుసుకోకుండా విమర్శలు చేయడం బాధ కలిగిస్తుందని పేర్కొన్నారు. తాజా ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ, తాను కండరాల వాపుకు సంబంధించిన మయోసైటిస్ వ్యాధితో పోరాడిన విషయం అందరికీ తెలిసిందే నన్నారు. ఆ వ్యాధి ప్రభావం వల్లే తన బరువు తగ్గిందని, అందం కోసం ప్రత్యే కంగా ఆహార నియమాలు పాటించి సన్నబడలేదని వివరించారు. ప్రస్తుతం తన ఆరోగ్యం గతంతో పోలిస్తే చాలా మెరుగుపడిందని సమంత తెలిపారు. అయితే వైద్యుల సూచనల మేరకు ఇప్ప టికీ ఆహార విషయంలో జాగ్రత్తలు తీసు కుంటున్నానన్నారు. అవసరానికి మిం చి తినడం ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో మితంగా ఆహారం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తీవ్ర అనారోగ్య సమయంలో తనకు ఇష్టమైన ఆహారం తినలేని పరిస్థితిని ఎదుర్కొన్నానని సమంత గుర్తు చేసుకున్నారు.





# 'మా ఇంటి బంగారం'.. సమంత ఖాతాలో మరో విజయవంతమైన చిత్రం

హైదరాబాద్, జూన్ 19

మూడేళ్ల విరామం తర్వాత సమంత ప్రధాన పాత్రలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'మా ఇంటి బంగారం' చిత్రం మంచి అంచనాల నడుమ విడుదలైంది. 'ఓ బేబీ' తర్వాత దర్శకురాలు నందినీరెడ్డి, సమంత కలయికలో వచ్చిన ఈ చిత్రంపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా సమంత తొలిసారిగా పూర్తి స్థాయి యాక్షన్ పాత్రలో కనిపించడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారు. కథ విషయానికి వస్తే, ప్రేమ వివాహం చేసుకుని సంప్రదాయ కుటుంబంలో పెద్ద కోడలిగా అడుగుపెట్టిన స్వర్ణ పాత్రలో సమంత కనిపిస్తుంది. ఇంట్లో తన స్థానాన్ని సంపాదించుకునే ప్రయత్నాలు చేస్తూనే కుటుంబంతో కలిసిపోవడానికి ప్రయత్నిస్తుంది. ఇదే సమయంలో ఆమె గత జీవితం వెంటాడుతూ కథ అనూహ్య మలుపులు తిరుగుతుంది. స్వర్ణగా జీవిస్తున్న ఆమె అసలు పేరు ఝాన్సీ అని బయటపడటం, గతంతో ముడిపడిన ప్రమాదకర వ్యక్తి తిరిగి ఆమె జీవితంలోకి రావడం కథను ఉత్కంఠభరితంగా మారుస్తుంది. సినిమా తొలి భాగం కుటుంబ నేపథ్యంలో సరదాగా సాగుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. కుటుంబ సభ్యుల మధ్య వచ్చే హాస్య సన్నివేశాలు, పెద్ద కోడలిగా స్వర్ణ ఎదుర్కొనే పరిస్థితులు సహజంగా అనిపిస్తాయి. అనంతరం కథ యాక్షన్, భావోద్వేగాల వైపు మలుపు తిరిగి ఆసక్తిని పెంచుతుంది. సమంత పాత్రలో వచ్చే మార్పు, ఆమె పోరాట సన్నివేశాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తాయి. రెండో భాగంలో కథ కొంత నెమ్మదించిన భావన కలిగించినప్పటికీ, కీలక ఘట్టాలు, యాక్షన్ సన్నివేశాలు సినిమాను నిలబెడతాయి.



# కృతి-షాహిద్ జోడీ మెప్పించిందా? 'కాక్‌టెయిల్ 2'పై ప్రేక్షకుల తీర్పు ఇదే!

ముంబై, జూన్ 19

బాలీవుడ్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన రొమాంటిక్ డ్రామా 'కాక్‌టెయిల్ 2' శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. షాహిద్ కపూర్, కృతి సనన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం విడుదలైన తొలి రోజే సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారి తీసింది. గతంలో భారీ విజయాన్ని సాధించిన 'కాక్‌టెయిల్' చిత్రానికి ఆధ్యాత్మిక కొనసాగింపుగా తెరకెక్కిన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ముందుగానే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా కృతి సనన్ నటన, షాహిద్‌తో ఆమె కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని తొలి స్పందనలు సూచిస్తున్నాయి. దర్శకుడు హోమీ అడజానియా తెరకెక్కించిన ఈ చిత్రం విడుదలకు ముందే ముందస్తు బుకింగ్స్ రూపంలో మంచి స్పందనను అందుకుంది. దేశవ్యాప్తంగా వేలాది ప్రదర్శనలకు గాను టికెట్ల విక్రయాలు జోరుగా సాగాయి. విడుదలకు ముందే కోట్ల రూపాయల వసూళ్లు నమోదు కావడంతో చిత్రబృందంలో ఉత్సాహం నెలకొంది. ప్రేమ, భావోద్వేగాలు, స్నేహం చుట్టూ తిరిగే కథ యువతను ఆకర్షించేలా ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రానికి కేంద్ర చలనచిత్ర ధ్రువీకరణ మండలి ఎలాంటి కత్తిరింపులు లేకుండా ప్రదర్శన అనుమతి ఇవ్వడం విశేషం. దర్శకుడు అనుకున్న కథనాన్ని యథాతథంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి అవకాశం లభించింది. చిత్రంలోని భావోద్వేగ సన్నివేశాలు, ప్రేమకథ, ప్రధాన తారాగణం నటన సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయని తొలి సమీక్షలు పేర్కొంటున్నాయి.